


నేతన్నల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్
జేఏసీ పోరాటానికి తాత్కాలిక విరమణ
8





కొత్త ఉషస్సులు కోటి ఆశలు

- క్రోధి సంవత్సరాదికి స్వాగతం.. శోభకృత్‌కు వీడ్కోలు
- పల్లెలు, పట్టణాల్లో సందడి
- ఆలయాల్లో పూజలు.. పంచాంగ శ్రవణాలు
- పచ్చడి రుచులు.. కవి సమ్మేళనాలు
- రాశి ఫలాలు.. జాతక చక్రాలు
- నేడు ఉగాది పండుగ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది. కోటి ఉషస్సుల కొత్త సంబరం. షడ్రుచుల సమ్మిళిత పండుగ. మంగళవారం క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శోభకృత్‌కు వీడ్కోలు పలికేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. పల్లెలు, పట్టణాల్లో ఇంటింటా మామిడి తోరణాలు, పూల పరిమళాలతో కలకలాడుతున్నాయి. సోమవారం నుంచే ఉగాదికి కావాల్సిన సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ సందడిగా మారింది. హిందూ సంస్కృతీసంప్రదాయాలకు అద్దంపట్టే తొలి పండుగగా చైత్ర శుద్ధ పాడ్యమిన జరుపుకోవడం ఆనవాయితీ.

తెలుగు సంవత్సరం ప్రారంభం రోజునే షడ్రుచులు అందించి జీవితంలో చేదు లేనిదే తీపి విలువ తెలియదని, ఉప్పు లేకపోతే పులుపు అర్థం కాదని, కారం, వగరును అందిస్తూ కష్టం, సుఖం, బాధ, ఆనందం, ఉత్తేజం, ఉద్వేగం ఆనందాన్ని ఉత్సాహాన్ని అందించేది ఉగాది. ప్రతీ ఇల్లు పచ్చటి తోరణాలతో కళకళ లాడుతుంది. వేప పువ్వు, లేత మామిడి కాయల ముక్కలు, కొత్త చింతపండు పులుసు, కొత్త బెల్లం పాన కంతో తయారు చేసిన ఉగాది పచ్చడి తయారు చేసి ఇంటిల్లిపాది తీసుకుంటారు. ఇరుగు పొరు గు వారిని పిలిచి ఉగాది శుభా కాంక్షలు తెలు పుతూ పచ్చడి అందిస్తారు. జిల్లాలోని వివిధ సంస్థల్లో ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేశారు. పం చాంగ శ్రవణం, కవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు.

ఆరోగ్యాన్నిచ్చే పచ్చడి

ఉగాది పచ్చడి ఆరోగ్య రీత్యా చాలా మంచి గుణాలను ఇస్తుందని పెద్దలు భావిస్తారు. తీపి, పులుపు, ఉప్పు, వగరు, చేదుతో తయారయ్యే పచ్చడిలో చెరుకు, అరటి, మామిడి, వేపపూలు, కొత్త చింత, జామకాయలు, బెల్లం కూడా వేస్తారు. కొత్త కుండలో వీటి సమ్మేళనంతో రసం తయారు చేస్తారు. ఉగాది పచ్చడిని 'నింబ కుసుమ భక్షణం', అశోక కలిక ప్రాశనం అని కూడా పిలుస్తారు. ఉగాదిరోజు ప్రత్యేకంగా ఫలానా దేవుడిని పూజించాలని లేక పోవడంతో ఎవరి ఇష్టదైవాన్ని వారు పూజిస్తారు. విశ్వకర్మలు మాత్రం అమావాస్య నుంచే మూడు రోజులపాటు వేడుకలు జరుపుకుంటారు.

రాశిఫలాలు.. జాతకచక్రాలు

ఉగాది పండుగ కొత్త పంచాంగం వచ్చిందంటే అందరిలోనూ రాశి ఫలాలు, జాతక చక్రాలపైనే ఆసక్తి ఉంటుంది. సంవత్సరంలో జాతక చక్రం ప్రకారం రాశిఫలాలు, గ్రహస్థితులు ఎలా ఉన్నాయో తెలుసుకోవడానికి ఇష్ట పడుతారు. జిల్లాలోని అన్ని దేవాలయాల్లో పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు చేశారు.

పాఠశాలల్లో ముందస్తు వేడుకలు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను విద్యార్థులు సంబరంగా జరుపుకున్నారు. పచ్చడి తయారు చేసి పంచారు. పాఠశాలను ముస్తాబు చేయడంతో పండుగ వాతావరణం ముందే మొదలైంది. విద్యార్థులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపాధ్యాయులు పం డుగ ప్రాశస్త్యం గురించి వివరించారు.

జోరుగా పచ్చడి కుండల కొనుగోళ్లు

సూర్య ప్రతాపం ఎక్కువగా ఉంది. ఎండలో చల్లటి నీళ్ల తాగడానికి పచ్చడి కుండలు ఉపయోగపడుతాయి. ఉగాది రోజు పచ్చడి చేసుకునే కుండలు చల్లటి నీళ్ల కోసం ఉపయోగిస్తారు. ఈసారి మట్టి కుండలకు గిరాకీ పెరిగి ధరలు భయపెట్టాయి. సైజ్‌ను బట్టి రూ.100 నుంచి రూ. 300 వరకు విక్రయించారు. పచ్చడికి ఉపయోగించే మామిడి కాయలు, చింతపండు, వేప పువ్వు సైతం మార్కెట్‌లో భారీ ధరలే పలికాయి.



క్షేత్రస్థాయిలో పనులను గుర్తించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 8: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులను క్షేత్రస్థాయిలో గుర్తించాలని, తరువాతే ముందుకు వెళ్లాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మఆదర్శ పాఠశాలల్లో భాగంగా చేపట్టాల్సిన మరమ్మతు పనులపై కలెక్టరేట్‌లో నీటి పారుదల, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, మున్సిపల్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ అధికారులు, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపిక చేసిన స్కూల్‌లలో విద్యుత్, తాగునీటి సరఫరా, టాయిలెట్‌ల మరమ్మతు ఇతర పనులను కమిటీ సభ్యులు, స్కూల్ హెచ్ఎం, అధికారులు పరిశీలించాలని సూచించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీ సీఈవో ఉమారాణి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ డీఈ అనిత సింగనాథ్, డీఈవో రమేష్ కుమార్, డీఆర్డీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి, పీఆర్ ఈఈ సూర్య ప్రకాష్, ఆర్అండ్‌బీ ఈఈ శ్యామ్ సుందర్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 8: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో గర్భిణుల నమోదు, ప్రసవాలు, ఎనీమియా కేసు గుర్తింపు తదితర అంశాలపై కలెక్టరేట్‌లో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద శాతం సీజేరియన్లు చేసే ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ సంతోష్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్ రావు, డాక్టర్ మహేష్ రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు నయీం జహా, ఉమా పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 8 : గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రించవచ్చని రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. తుర్కాశీనగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపించినా, అనుమానాస్పదంగా అనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రూరల్ ఎస్సై మారుతి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8: సిరిసిల్ల పట్టణంలోని జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత ప్రారంభించారు. సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, జూనియర్ సివిల్ జడ్జి సృజన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ బైరగోని లావణ్య

చందుర్తి, ఏప్రిల్ 8: గ్రామాల అభివృద్ధిలో అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బైరగోని లావణ్య అన్నారు. చందుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లావణ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు నివేదికలను చదివి వినిపించారు. లింగంపేట ఎంపీటీసీ సభ్యుడు పెగ్గర్ల రమేష్‌రావు, మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. గృహ జ్యోతి పథకం కొందరికి మాత్రమే వర్తింప చేశారని, ప్రతీ ఒక్కరికి వర్తింపజేయాలని అన్నారు. వేసవిలో ముందస్తు ప్రణాళికతో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. చందుర్తి రోడ్డుకు ఇరువైపుల ఇష్టానుసారంగా తవ్విన గుంతలపై ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. నష్ట పరిహారం నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందించాలన్నారు. పింఛన్ల అమలుపై ప్రభుత్వానికి నివేదికలు అందించాలన్నారు. శ్రీనిధి లోన్‌ల విషయంలో అదనపు ప్రీమియం చెల్లింపులపై సభ దృష్టికి తీసుకొచ్చారు. వరి పంటకు రూ.500 బోనస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ నాగం కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్, అధికారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు కలెక్టర్ గౌతమి, అధికారులు

ఓటు హక్కు వినియోగించుకోవాలి

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అర్హులు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం 'ఐ వోట్ ఫర్ ష్యూర్' పేరిట స్వీప్ ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం 2 కేరన్‌ను ప్రారంభించారు. బతుకమ్మ ఘాట్ వరకు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్లు ప్రలోభాలకు లోను కావద్దన్నారు. సిరిసిల్ల ఆర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మొయినుద్దీన్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, జిలా స్పోర్ట్స్ యూత్ శాఖ అధికారి రాందాస్, ఏపీవో పాపారావు పాల్గొన్నారు.











నేతన్నల సమస్యలు పరిష్కరించాలి

కరీంనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నేతన్నల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రతాప రామక్రిష్ణ, రెడ్డబోయిన గోపి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ 10న సిరిసిల్లలో నేతన్నలకు అండగా దీక్ష తలపెట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సిరిసిల్ల వెళ్లి వస్త్ర పరిశ్రమ ఆసాములతో సమావేశమయ్యారని తెలిపారు. చర్చల అనంతరం నేతన్నలు వస్త్ర పరిశ్రమ తెరిచేందుకు అంగీకరించారన్నారు. ఇది బీజేపీ సాధించిన విజయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్నలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వెంటనే బతుకమ్మ చీరల బకాయిలు 270 కోట్ల రూపాయలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లు ఇవ్వాలని, విద్యుత్ బిల్లులపై 50 శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే నేతన్నల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు.

వ్యవసాయ పంపుసెట్ల దొంగ అరెస్టు

సుల్తానాబాద్, ఏప్రిల్ 8: వ్యసనాలకు బానిసగా మారిన ఓ యువకుడు ఇరవై ఏళ్లుగా చోరీలకు పాల్పడుతుండగా అతన్ని పట్టుకుని అతని వద్ద నుంచి ఇరవై వ్యవసాయ పంపుసెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పెద్దపల్లి ఏసీపీ గజ్జి క్రిష్ణ తెలిపారు. సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలోని పొత్కపల్లి పోలీస్‌లు గుంపుల సమీపంలో వంతెన వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్ర వాహనంపై వెలుతున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా అతన్ని వెంబడించి పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా అతను కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట కొత్తపల్లి గ్రామానికి చెందిన గోపు సంపత్‌గా గుర్తించారు. ఇతను పాత నేరస్తుడని గతంలో అనేక దొంగతనాలు చేసి జైలుకు కూడా వెళ్లి వచ్చాడన్నారు. విచారణలో ఈ ప్రాంతంలో అనేక వ్యవసాయ పంపుసెట్లను దొంగలించినట్టు చెప్పాడని దాంతో అతని ఇంట్లో తనిఖీ చేయగా అక్కడ ఉన్న వివిధ కంపెనీలకు చెందిన మూడు లక్షల రూపాయల విలువ గల ఇరవై మోటార్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అవసరాలకు ఒక్కో మోటార్‌ను అమ్ముతూ ఉంటాడని అలా జమ్మికుంట హన్మకొండ ప్రాంతాలలో మోటార్లను అమ్మడానికి వెలుతుండగా అతన్ని పట్టుకున్నట్లు తెలిపారు. కాలువల మీద ఏర్పాటు చేసుకున్న మోటార్లను లక్ష్యంగా చేసుకుని వాటిని చోరీ చేసాడన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఏసీపీ క్రిష్ణ

పోలీసులకు పట్టుబడిన మోటార్ల దొంగ సంపత్ తన అవసరాల కోసం డబ్బులు కళ్ల జూడడం కోసం ఎలాంటి దొంగతనం అయినా చేయడానికి వెనకాడడని ఏసీపీ అన్నారు. 2004 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్న సంపత్‌పై ఇప్పటి వరకు 16 కేసులు నమోదు అయి ఉన్నాయని అన్నారు. ఇతన్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సుబ్బారెడ్డి, పొత్కపల్లి ఎస్‌ఐ అశోక్ రెడ్డి, ఏఎస్‌ఐ తిరపతి, రత్నాకర్, హెచ్‌సీ నల్లవెళ్లి సుధాకర్, పీసీ రాజేందర్ సిబ్బందిని ఏసీపీ అభినందించి కొందరికి క్యాష్ రివార్డును అందజేశారు.

రాజన్న ఆలయానికి అమావాస్య ఎఫెక్ట్

వేములవాడ, ఏప్రిల్ 8: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో సోమవారం అమావాస్య ప్రభావం కనిపించింది. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా సోమవారం అతి తక్కువ సంఖ్యలో భక్తులు శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలోని క్యూలైన్లు, ఆలయ ప్రాంగణం భక్తులు లేక బోసిపోయి ఖాళీగా కనిపించాయి. ఇదిలా ఉండగా సోమవారం అమావాస్య కలిసి వచ్చిన సోమావతి ఎంతో శుభకరమని పురాణాలు చెబుతున్నాయి. అయినప్పటికీ సోమవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడం గమనార్హం.


భక్తులు లేక వెలవెలబోయిన ఆలయ ప్రాంగణం

నేడు రాజన్న క్షేత్రంలో ఉగాది వేడుకలు

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర క్షేత్రంలో ఉగాది వేడుకలు 9వ తేదీ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉగాది పండుగ సందర్భంగా ఉదయం ఎనిమిది గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము, రుత్విక్ వరుణము, శ్రీస్వామివారికి ప్రత్యేక పూజలు, అనుబంధ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం 10 గంటల 15 నిమిషాలకు పంచాంగ పూజ గావిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు పంచాంగ శ్రవణం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పండితులను సన్మానిస్తారు. రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారలను పెద్దసేవపై ఊరేగిస్తారు. ఇదిలా ఉండగా 9వ తేదీ మంగళవారం ఉగాది పర్వదినం నుంచి 17వ తేదీ బుధవారం శ్రీరామనవమి వరకు తొమ్మిది రోజులపాటు శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజులపాటు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శ్రీ పార్వతీ రాజరాజేశ్వర స్వామి, శ్రీ సీతారామచంద్రస్వామి వారలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాలలో భాగంగా 15వ తేదీ సోమవారం నుండి 17వ తేదీ బుధవారం వరకు మూడు రోజులపాటు భక్తోత్సవము, హవనము నిర్వహిస్తారు.

17వ తేదీ బుధవారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ ఎదురుగా గల ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి శ్రీ సీతారామచంద్ర స్వామి వారల దివ్య కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదిన వేడుకలు, శ్రీరామ నవరాత్రి ఉత్సవాలు, శ్రీ సీతారామచంద్ర స్వామి వారల కళ్యాణోత్సవం కోసం ఆలయ అధికారులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు అభిషేకం, కల్యాణం టికెట్ల నిలిపివేత

వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో 9వ తేదీ మంగళవారం స్వామివారి నిత్య కల్యాణం, అభిషేకం టికెట్లను నిలిపివేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి డి.కృష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజల నేపథ్యంలో భక్తులు పాల్గొనే స్వామివారి నిత్య కల్యాణం, అభిషేకం టికెట్ల జారీని నిలిపివేస్తున్నామని, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

యువకుడి గల్లంతు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్8: మండలంలోని కందుగుల గ్రామంలో ఈతకు వెళ్లి ఓ యువకుడు గల్లంతైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మాదం విజయ్(22) హైద్రాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఉగాది పండుగను పురస్కరించుకొని స్వగ్రామానికి వచ్చాడు. స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని ఉరకుంట దగ్గర ఉన్న వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లారు. ఈత అనంతరం స్నేహితులందరూ బయటికి రాగా విజయ్ రాకపోవడంతో వెంటనే స్నేహితులు తల్లిదండ్రులకు సమాచారం అందించారు. గత ఈతగాళ్లను బావి వద్దకు వచ్చి ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.

బీఐఎస్‌పై అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8: బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ (బీఐఎస్)ఆధ్వర్యంలో సోమవారం తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వివిధ వస్తువులు, ఆహారం, నీరు, తూనికలు, కల్తీపై చర్చించి, విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. విజేతలకు నగదు, ప్రశంసా పత్రాలు అందించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అంబు రాథోడ్, బిఐఎస్ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీకాంత్, జిల్లా కన్స్యూమర్ ఫోరం ప్రెసిడెంట్ పకిడి జీవన్, వైస్‌ప్రెసిడెంట్ అక్కి అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు ఇ కరుణ, ఎస్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోపిడీ కుట్ర కేసులో 29 ఏళ్లకు నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మారణాయుధాలతో భారీ దోపిడీకి కుట్ర చేసిన కేసులో 29 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సీఐడీ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 1995లో నమోదైన దోపిడీ కుట్ర కేసులో న్రర చందు అలియాస్ చంద్రయ్య ఏ-27గా ఉన్నాడు. కేసు నమోదు అయినప్పటి నుంచి చందు పరారీలో ఉన్నాడు. కేసు తీవ్రత నేపథ్యంలో జగిత్యాల రూరల్ పోలీస్‌ల నుంచి సీఐడీకి బదిలీ అయింది. అజ్ఞాతంలోఉన్న చందుపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో సీఐడీ పోలీస్‌లు గాలింపు మొదలు పెట్టారు. సీఐడీ చీఫ్ శీకాగోయల్ ఆదేశాల మేరకు ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ బృందం నిందితుడు చందు నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఉన్నట్లు గుర్తించింది. పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి చందును అరెస్ట్ చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐడీ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8:మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న ఇప్పలపల్లి రవీందర్(42) జమ్మికుంటకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై యూటర్న్ వద్ద ఒక్కసారిగా వాహనం రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇప్పలపల్లి రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రుడిని జమ్మికుంటకు తరలించారు.మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.


రవీందర్(ఫైల్)

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 8: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన పార్వతి సాగర్ (23) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు సంవత్సరాల క్రితం సాగర్ వ్యాపారం చేసుకునేందుకు తండ్రి రాజయ్యను డబ్బులు అడిగాడు. ఇవ్వక పోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స అనంతరం కోలుకున్నాక కిరాణం షాపు పెట్టాడు. షాపు నడువక పోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 1న పొలం వద్దకు వెళ్లి పని చేసుకుందామని తండ్రి తన కుమారుడికి చెప్పాడు. సాగర్ పొలం పనులకు వెళ్లకపోవడంతో ఎందుకు పొలం వద్దకు రాలేదని తండ్రి మందలించాడు. దీనికి తోడు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఎప్రిల్ 8: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, ఆర్‌ఆర్‌నగర్ కాలనీ మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్‌కుమార్ అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అనిల్‌కుమార్ మూడు రోజుల క్రిందట ద్విచక్ర వాహనంపై కామారెడ్డి వైపు వస్తుండగా, ఆర్‌ఆర్‌నగర్ కాలనీ వద్ద వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. దీంతో ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి కరీంనర్‌కు మెరుగైన చికిత్స కోసం తరళించారు. పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌కు తరళించగా చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు.

వరకట్న హత్య కేసులో భర్త, అత్తకు జీవిత ఖైదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 8: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అదనపు కట్నం కోసం వేధించి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో నేరం రుజువు కావడంతో దోషులు బిస్స రాజు, బిస్స దుర్గమ్మకు గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు... గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడి కుమార్తె బీనవేని గౌతమి హనుమాన్‌నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బిస్స రాజు మార్చి 14, 2009లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గౌతమి తండ్రి సింగరేణి పదవీవిరమణ చేయడంతో వచ్చిన డబ్బుల నుంచి రూ.10లక్షలు కట్నం తేవాలంటూ గౌతమిని భర్త రాజు, అతని తల్లి బిస్స దుర్గమ్మ వేధించే వారు. ఇదే క్రమంలో ఆగస్టు9, 2014న గౌతమిని భర్త రాజు, అత్త దుర్గమ్మ గొంతు నులిమి హత్య చేశారు. తరువాత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహంపై కిరోసిన్ పోసి నిప్పటించారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది. మృతురాలి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ ఫకిరప్ప చార్జిషీట్ దాఖలు చేశారు. మృతదేహం సమీపంలో చున్ని కాలకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు తీగ లాగడంతో హత్య ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుత వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్, సీఎంఎస్ ఇన్‌చార్జి కొత్తకొండ శంకర్ ప్రాసిక్యూషన్ పక్షాన 28మంది సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు పీపీ జ్యోతిరెడ్డి సాక్ష్యాలు నిరూపించడంతో విచారణ జరిపి న్యాయస్థానం దోషులకు జీవిత ఖైదు విధించారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

గణేశ్‌నగర్, ఏప్రిల్8: ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇషాక్ మాట్లాడుతూ ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ఒక విద్యా కేంద్రంగా మారుతున్న తరుణంలో కనీసం విద్యార్థులు ఉండడానికి సంక్షేమ హాస్టళ్లు కరువయ్యాయని అన్నారు. ఉన్న హాస్టళ్లు కళాశాల నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విద్యార్థులు రోజూ కళాశాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో చందు, శ్రీరామ్, మనోజ్, అంజన్, శృజన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తిపై కేసు

జమ్మికుంట, ఏప్రిల్ 8: తప్పుడు పత్రాలు సృష్టించి ఇంటి స్థలాన్ని కబ్జా చేయాలని చూసిన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన పచ్చిమట్ల శ్రీనివాస్ ఇంటి స్థలాన్ని ఆకినపల్లి మురళీధర్ అనే వ్యక్తి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి కాజేయాలని చూశాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

శానిటేషన్ కార్మికులకు అరియర్స్ చెల్లించాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 8: కరీంనగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు అరియర్స్ చెల్లించాలని కరీంనగర్ మున్సిపాలిటీ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(బీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ పెంచారని, రెండు సంవత్సరాలు అవుతున్నా ఇంకా అందివ్వలేదన్నారు. మహిళా కార్మికులకు చీపుర్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. చెత్తను తరళించే ట్రాక్టర్లు, ఆటోలకు టైర్లు, ఆయిల్ మార్చడంలేదని, వెల్డింగ్ పనులు కూడా చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు రావలసిన సబ్బులు, చెప్పులు, నూనెలు, దుస్తులు ఏవీ ఇవ్వకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. నాలుగు నెలల ఎరియర్స్ ఇతర బెనిఫిట్స్ ఇవ్వాలని లేని యెడల ఈ నెల 10 నుంచి సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షుడు గడ్డం


మాట్లాడుతున్న వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

సంపత్, గాలి శ్రీనివాస్, బొల్లి రాజేశ్, పార్నంది ఎల్లయ్య, మేకల రాములు, గడ్డం రాములు, జిల్లెల్ల అనిల్‌కుమార్, దాంపల్లి రాయమల్లు, పురుషోత్తం శ్రీనివాస్, దాసరి రమేశ్, తంగళ్ళపల్లి ధర్మేందర్ పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన సదస్సు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 : షీటీంలు నిర్వర్తించే విధులపై కరీంనగర్ మహిళా ఠాణా సీఐ, షీటీం ఇంచార్జి పి శ్రీలత బీసీ స్టడీ సర్కిల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల వినియోగ సమయంలో మహిళలు, విద్యార్థులు, యువతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీ సేఫ్ యాప్‌ను 70 మంది విద్యార్థులతో సీఐ డౌన్‌లోడ్ చేయించారు.

వృద్ధుడి అదృశ్యం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 8: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జనగామ గ్రామానికి చెందిన రాయమల్లు(72) అదృశ్యమయ్యాడు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాయమల్లు కనిపించకుండా పోయాడు. బంధువులు గాలించినా ఆచూకీ లభించలేదు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా రాయమల్లు ఆచూకీ తెలిసినవారు గ్రామ పోలీస్ అధికారికి (9912051517) సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

కాలువనీటి కోసం రైతుల ఆందోళన

చొప్పదండి, ఏప్రిల్8: పంటలకు శ్రీరాంసాగర్ నీటిని విడుదల చేయాలని కోరుతూ చొప్పదండిలో రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం చొప్పదండిలో రాయపట్నం రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. డి87 కాలువ పరిధిలోని వరిపొలాలు నీరు లేక ఎండిపోతున్నాయని మరో తడి నీరు అవసరమని వెంటనే కాలువకు నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. వందలాది ఎకరాలలో పంటలు చేతికి అందే సమయంలో నీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ అధికారుల దృష్టికి తీసుకుపోతామని పోలీసులు రైతులకు నచ్చజెప్పడంతో రాస్తారోకోను విరమించారు. మండలంలోని చొప్పదండి, కొలిమికుంట, చాకుంట గ్రామాలకు చెందిన రైతులు రాస్తారోకోలో పాల్గొన్నారు.


చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

ఒకరి ఆత్మహత్య

మల్యాల, ఏప్రిల్ 8: మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన ఓ వ్యక్తి మతిస్థిమితం సరిగాలేక చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆరెల్లి మల్లయ్య(45) కొండగట్టు మెట్ల దారి సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం సరిగాలేక పోవడంతో మల్లయ్యను కొండగట్టుకు తీసుకురాగా ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్, ఏప్రిల్, 8: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం మల్టీ జోన్ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 17న మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లోని కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అనే ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసుస్టేషన్ కార్యాలయం పైన మందు పార్టీ చేసుకున్నారు. పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి దావత్ చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో విచారరణ చేపట్టి ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై శాఖాపరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదికను అధికారులు పంపారు. నివేదిక ఆధారంగా హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌ను సోమవారం సస్పెండ్ చేసినట్లు మల్టీ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

నర్మాల గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గంభీరావుపేట, ఎప్రిల్ 8: గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలను అధికారులు సస్పెండ్ చేశారు. గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్‌సీవో మేరి యేసుపాదం నర్మాల ప్రిన్సిపాల్ నిర్మలను సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. నర్మాల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని యశస్వినిపై తల్లిదండ్రుల ముందే ప్రిన్సిపాల్ చేయిచేసుకున్న సంఘటన చర్చనీయాంశం కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై డీసీవో జాక్వీలిన్‌ను వివరణగా అడగా, నర్మాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేసినట్టు వెల్లడించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈ నెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 8: ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల అటానమస్ పీజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డిలు విడుదల చేశారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 2022-23 విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అటానమస్ హోదా పొందింది. కళాశాలలో పీజీ 1,3వ సెమిస్టర్ల పరీక్షలు మార్చిలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా.ఇ. కొమురయ్య, పురుషోత్తం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డా. ప్రమోద్ కుమార్ డా. మహేష్ పాల్గొన్నారు.

అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్ హస్నాపురి కాలనీ ప్రాంతంలోని ఒక ఇంటిలో ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రొడక్ట్ పేరిట అల్లం, వెల్లుల్లి తయారు చేస్తున్న కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, సంస్థ యజమాని శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుజాతలు తెలిపారు. శుభ్రత పాటించటం లేదని, నాణ్యత లేదనే ఫిర్యాదులతో ఫుడ్ ప్రొడక్ట్ సంస్థలపై వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రొడక్ట్‌లో తనిఖీలు నిర్వహించమాన్నారు. తనిఖీల అనంతరం శాంపిళ్లు సేకరించి హైదరాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ లాబ్‌కు పంపించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు వచ్చిన తర్వాత దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత వెల్లడించారు. కేంద్రంలో నిబంధనల మేరకు శుభ్రత పాటించనందున యజమానికి నోటీసు జారీ చేశామని తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈనెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోన్ని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్ఐ స్వామి పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 : ఒక ప్రయాణికుడిని నగర శివారు ప్రాంతానికి తీసుకువెళ్లి కొట్టి దోపిడీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ గత నెల 30న కరీంనగర్‌కు వచ్చి తన పని ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో కోతిరాంపూర్ నుంచి బస్టాండ్ వెళ్లుటకు ఆటోలో ఎక్కాడు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి కలిసి షేక్ షబ్బీర్‌ను సిరిసిల్ల బైపాస్ వైపుగా తీసుకెళ్లి కొట్టి మొబైల్ ఫోన్‌తో పాటు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గండిపెల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నూనావత్ తిరుపతి, బానోత్ రాజులు నిందితులుగా పోలీసులు గుర్తించారు. షబ్బీర్ నుంచి 13 వేల రూపాయల విలువ సెల్ ఫోన్‌తో పాటు బ్యాగ్, అందులోని బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం కార్డు కార్డులు దోపిడీ చేశారు. బాధితుడి మొబైల్ ఫోన్‌లోని సిమ్ కార్డును నిందితుల మొబైల్ ఫోన్‌లోకి మార్చి బ్యాంకు అకౌంట్ ద్వారా 99 వేల రూపాయలను సైతం అపహరించారని విచారణలో వెల్లడైంది. నిందితులిద్దరు టవర్ సర్కిల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించామన్నారు.

కాంగ్రెస్ విజయంలో ఎన్‌ఎస్‌యూఐ కీలక పాత్ర

- ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో ఎన్ఎస్‌యూఐ కీలక పాత్ర పోషించిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ పక్షాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని మరోసారి పట్టుదలతో పనిచేసేందుకు ఎన్ఎస్‌యూఐ నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి హైదరాబాద్‌లో వర్షాలు పడ్డప్పుడు బండి కొట్టుకుపోతే బండి ఇస్తామని హామీలిచ్చి మోసం చేశారని, అటువంటి నాయకుడిని ఓడించాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు మతం పేరు మీద రాజకీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయానికి, కొండగట్టు, వేములవాడ ఆలయాలకు ఎన్ని నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

నేతన్నల జీవితాలతో ఆటలాడుతున్న బీజేపీ, బీఆర్ఎస్

- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్


సిరిసిల్లలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 8: నేతన్నల జీవితాలతో బీజేపీ, బీఆర్ఎస్ రాజకీయంగా ఆటలాడుతున్నాయని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కేవలం నాలుగు నెలలు మాత్రమే అయ్యిందని అన్నారు. నేతన్నల పేరు మీద రెండు పార్టీల నాయకులు శవరాజకీయాలు చేస్తున్నా రన్నారు. నేతన్నలు, ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్న ఆలోచనతో తామందరం ముందుకొచ్చామన్నారు. స్వాతంత్రం వచ్చిననాటి నుంచి నేతన్నల ప్రయోజనం కోసం ఏదైనా నిర్ణయం తీసుకుందంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 12 శాతం జీఎస్టీ వేసిందన్నారు. బీజేపీ ప్రభుత్వం జాతీయ చేనేత బోర్డు, జాతీయ టెక్స్‌టైల్ బోర్డు, మహాత్మగాంధీ గుణకర్ బీమాయోజన, ఐసీఐసీఐ లాంబార్డ్ ఆరోగ్య బీమాను రద్దు చేసిందన్నారు. హస్తకం వర్క్‌షెడ్ కార్యక్రమం నిలిచి పోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఎస్ఐడీపీ పేరు మీద స్పెషల్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ ప్రమోషన్ కింద కొన్ని వేల కోట్ల నిధులను ఇచ్చిందని, ఈ ఫండ్ కింద తమిళనాడుకు ఎన్ని నిధులు పోయాయి, తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో 10న దీక్ష చేస్తానన్న పార్లమెంట్ సభ్యుడు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్ఐడీపీ కింద రూ.350 కోట్లు ప్రతిపాదన ఉంటే 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం కట్టడానికి సిద్ధంగా ఉందని, మిగిలింది కేంద్రం నుంచి తీసుకురావాలని అన్నారు. రూ. 558 కోట్ల అప్పు ఎవరు పెట్టారని, అందులో రూ.352 కోట్ల బతుకమ్మచీరల బకాయిలను మీరు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. 393 సంఘాలు ఉంటే 105 మాత్రమే పని చేస్తున్నాయన్నారు. బతుకమ్మ చీరలను పక్కన బెడితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో తమకు పనిలేదు అన్న మాట రాకుండా కార్మికులకు పని ఇస్తామన్నారు. రాష్ట్రంలో అన్ని అవసరాలకు సంబంధించి వస్త్రాలను సిరిసిల్ల నుంచి కొనుగోలు చేయడం కోసం 2024 మార్చి 11న ప్రభుత్వం ద్వారా జీవో నంబరు 1 తీసుకొచ్చామన్నారు. నాలుగు నెలల కాలంలో సిరిసిల్లకు రూ.120 కోట్ల ఆర్డర్‌ను ఇచ్చామన్నారు. రూ.180 కోట్లు విడదల చేశామన్నారు. రెండు చేతులు జోడించి సిరిసిల్ల నేతన్నలను కోరుతున్నామని, ఏ సమస్య ఉన్నా తమ నాయకుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. చావు ఒక్కటే మార్గం కాదని, రాజకీయం కోసం ప్రతిపక్షాలు ప్రేరేపించవచ్చని, ఇక్కడి ఎంపీ, ఎమ్మెల్యే రెచ్చగొట్టవచ్చని అన్నారు. కేటీఆర్ ఇచ్చిన ఆర్డర్ల కంటే ఒక్క రూపాయి ఆర్డర్ ఎక్కువ ఇస్తామన్నారు. బకాయిలకు సంబంధించిన బాధ్యత తమదేనన్నారు. ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి సిరిసిల్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ఒక దశ ఇప్పుడు వచ్చే నెల మొదటి వారంలో ఇంకో దశ నిధులు మంజూరు చేస్తారని అన్నారు. ఆనాడు సిరిసిల్లకు రావాల్సిన టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్ ఇక్కడి నుంచి వరంగల్‌కు మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తీసుకెళ్లారన్నారు. నేతన్నలు ధైర్యంగా ఉండాలని, అధికారులు నిర్లక్ష్యం చేస్తే వారిని మీ ముందు నిలదీస్తామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా జిల్లా అధ్యక్షురాలు కామురి వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, కౌన్సిలర్లు వేముల రవి, గుండ్లపల్లి రామానుజం, రెడ్యానాయక్, మాజీ కౌన్సిలర్లు మడుప శ్రీదేవి, యెల్లె లక్ష్మీనారాయణ, జిల్లా, పట్టణ నాయకులు, అనుబంధ సఘాల నాయకులు పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణకు చర్యలు

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల వస్త్రపరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే నేతన్నలకు ఏడాదిపాటు ఉపాధిని కల్పించే దిశగా ఆర్డర్‌లను ఇప్పించి బకాయిలను దశల వారిగా అందించేందుకు కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో సోమవారం చేనేత కార్మికుల జేఏసీ నాయకులు, యాజమానులు, ఆసాములతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతోందని, ఇంతలోనే నేతన్నలను ఆదుకోవడం లేదని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, మాజీ మంత్రి కేటీఆర్ దీక్షలు చేస్తామని ప్రకటించడం సరికాదని అన్నారు. కరీంనగర్ ఎంపీగా కొనసాగుతున్న బండిసంజయ్ నేతన్నలను పట్టించుకోలేదని, కేవలం ఎన్నికల కోసం రాజకీయం చేయడం శోచనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీని తీసుకొచ్చింది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. ఐదేళ్లు ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు రాగానే నేతన్నలపై బీఆర్ఎస్, బీజేపీకి ప్రేమ పుట్టుకొస్తోందన్నారు. వారి కోసం దీక్షలను చేస్తానని ప్రకటించడం శోచనీయమన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలకు డబ్బులను పెండింగ్‌లో పెట్టి ఇప్పుడు అధికారం పోవడంతో తమపై బురద చల్లడం కేటీఆర్‌కు అలవాటైపోయిందన్నారు. గత నెల 7న సిరిసిల్ల, వేములవాడలలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటను ఉండే అని, అనివారణ్య కారణాలతో రాలేదని అన్నారు. సీఎం వచ్చిఉంటే అప్పుడే నేతన్న సమస్యలకు పరిష్కారం లభించేదన్నారు. నేతన్నలు అధైర్యపడి అత్యహత్యలు చేసుకోవద్దని త్వరలోనే నాణ్యమైన ఆర్డర్‌లను అందిస్తాని హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు మంచె శ్రీనివాస్, మండల సత్యం, మూషం రమేష్, కోడం రమణ, పంతం రవి, తాటిపాముల దామోదర్, కట్టికోల లక్ష్మీనారాయణ, యెల్లే లక్ష్మీనారాయణ, సిరిసిల్ల రవీందర్, మండల రాజు, గోలి వెంకటరమణ, వెల్ముల స్వారూప తదితరులు పాల్గొన్నారు.

వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి

- అమ్మమ్మ తాత జ్ఞాపకార్థం పాఠశాల భవన నిర్మాణం

- 'ఎక్స్' వేదికగా ఆనందాన్ని పంచుకున్న కేటీఆర్


పూర్తయిన పాఠశాల భవనం

బోయినపల్లి, ఏప్రిల్ 8 : అమ్మమ్మ తాత జ్ఞాపకార్థం సొంత డబ్బులతో నిర్మించిన పాఠశాల భవనం తుది దశకు చేరుకుందని, వచ్చే విద్యాసంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి వస్తుందని ఎక్స్ వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ సోమవారం ఆనందాన్ని పంచుకున్నారు. కేటీఆర్ అమ్మమ్మతాత జోగినపల్లి లక్ష్మీకేశవరావు స్వగ్రామమైన బోయినపల్లి మండలం కొదురుపాకలో వారి జ్ఞాపకార్థం 2023 జనవరిలో రూ.2 కోట్లతో మోడల్ స్కూల్ నిర్మించేందుకు భూమి పూజ చేశారు.

పాఠశాలల్లో ఉగాది వేడుకలు


ఉగాది సంబరాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

తంగళ్లపల్లి, ఏప్రిల్ 8: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల, తంగళ్లపల్లి గ్రామంలోని శుభోదయం ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉగాది సంబరాలు నిర్వహించారు.పాఠశాల హెచ్ఎం ఉపేందర్, శుభోదయం కరస్పాండెంట్ శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో 9వ తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. కరస్పాండెంట్ ఏలిగేటి నరేష్, డైరెక్టర్‌లు తిపిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎర్రం గంగనర్సయ్య, పడాల సురేష్, ప్రిన్సిపాల్ హరినాథ్‌రాజు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి: బోయినపల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు బొలగం శ్రీనివాస్, తెలుగు పండిట్ మోహనకృష్ణ పాల్గొన్నారు.

జేఏసీ పోరాటానికి తాత్కాలిక విరమణ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8 : వస్త్ర పరిశ్రమలో సంక్షోభం నివారణకు మంత్రి పొన్నం ప్రభాకర్ హామీతో జేఏసీ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్‌లు మూషం రమేష్, పంతం రవి తెలిపారు. సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యల పరిష్కారం, నేతన్నలకు ఉపాధి కల్పించడంతోపాటు పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. సమావేశంలో కమిటీ సభ్యులు మండల సత్యం, తాటిపాముల దామోదర్, కోడం రమణ, మంచే శ్రీనివాస్, కట్టికోల లక్ష్మీనారాయణ, సిరిమల్ల సత్యం, సిరిసిల్ల రవీందర్, పిస్క మధు, గోవిందు రవి, గోనే పర్శరాములు, నక్కదేవదాస్ పాల్గొన్నారు.

నేతన్నలను ఇంకెప్పుడు ఆదుకుంటారు?

వేములవాడ ఏప్రిల్ 8 : నేత కార్మికులు పస్తులతో చనిపోతున్నారని, ఇంకెప్పుడు ఆదుకుంటారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ప్రశ్నించారు. సోమవారం వేములవాడలో విలేకరులతో మాట్లాడారు. బతుకమ్మ చీరల బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని, కొత్త ఆర్డర్లు ఎందుకివ్వడం లేదని, 50 శాతం విద్యుత్ బిల్లుల సబ్సిడీని ఎందుకు పునరుద్ధరించడం లేదని అన్నారు. యారన్‌పై 10 శాతం సబ్సిడీ సంగతేమైందని, అధికారంలో ఉన్నవాళ్ల నేత కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఇతర పార్టీలను తిట్టడం సమంజసం కాదని అన్నారు. ప్రభుత్వ మెడలు వంచి నేతన్నలకు అండగా ఉండేందుకే బండి సంజయ్ దీక్ష చేయనున్నట్లు చెప్పారు. పనులు లేక, చేసిన పని బకాయిలు రాని కారణంగా సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమను మూసివేసి నాలుగు నెలలుగా ఒకవైపు నేత కార్మికులు మరోవైపు ఆసాములు రోడ్డున పడితే ఆదుకోకుండా మంత్రి పొన్నం ప్రభాకర్ ఎదురుదాడికి దిగడం సిగ్గు చేటన్నారు. బకాయిలు చెల్లిస్తామని కొత్త ఆర్డర్లు ఇస్తామని చెబుతున్న మాటలను ఆచరణలో పెట్టాలని కోరారు. సిరిసిల్లలో నేత కార్మికుల దుస్థితికి ప్రభుత్వమే కారణమని, రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టడంతోపాటు నేతన్నలకు, ఆసాములకు అండగా ఉండేందుకే సిరిసిల్లలో బండి సంజయ్ దీక్ష చేపడుతున్నారన్నారు.

ప్రేమ వివాహం చేసుకున్న జంట

- కూతురు చనిపోయిందని ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన తండ్రి

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8: ఓ జంట ప్రేమ వివాహం చేసుకోవడంతో యువతి తల్లిదండ్రులు తల్లిడిల్లిపోయారు. తమ కూతురు చనిపోయిందని ఇంటి ఎదుట ఫ్లెక్సీ ఏర్పాటు చేసి విలపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న సంఘటన సోమవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన చిలువేరి అనూష(18) బీటెక్ చదువుతోంది. అదే కాలనీకి చెందిన లింగం హరికుమార్(22) గుమాస్తాగా పని చేస్తున్నాడు. రెండేళ్లుగా ప్రేమించుకుంటున్న వీరు ఆదివారం ప్రేమ వివాహం చేసుకున్నారు. తమకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై అనూష తల్లిదండ్రులను స్టేషన్‌కు రావాలని పోలీసులు పిలిచారు. వారు రాకపోవడంతో హరికుమార్ తల్లిదండ్రులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న అనూష తల్లిదండ్రులు తమ కూతురు చనిపోయింది.. అశ్రు నివాళి అని ఫ్లెక్సీ రాయించి.. ఇంటి ఎదుట ఏర్పాటు చేశారు. ఏ తల్లిదండ్రులకూ ఈ కష్టం రావద్దంటూ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న వీడియో వైరల్ అయ్యింది. తన కూతురు ఉన్నత శిఖరాలకు చేరాలని మంచి కళాశాలలో చదివిస్తున్నానని, ఆ కలలన్నీ నీరుగారాయని, తమకు చెప్పకుండానే ఇంటినుంచి వెళ్లిపోయిందని, ఒకడు ట్రాప్ చేసి ఎత్తుకెళ్లాడని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధిహామీ పనుల లక్ష్యాలను అధిగమించాలి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 8: ఉపాధిహామీ పనులలో కూలీల సంఖ్యను పెంచి లక్ష్యాలను అధిగమించాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో చంద్రయ్య, ఈసీ హర్షద్ పాల్గొన్నారు.

టెట్ ఫీజు తగ్గించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 8: టెట్-2024 ఫీజు తగ్గించాలని బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్‌ను వినతి పత్రాన్ని అందించారు. ఈ సంద ర్భంగా అయన మాట్లాడుతూ ఫీజులు భారీగా పెంచ డం నిరుద్యోగులపై భారం మోపడమే అవుతుందన్నారు. జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, నాయకులు రుద్రవేణి సుజిత్ కుమార్, గౌరీ రాకేష్, కోడం వెంకటేష్, సురా రంజిత్, పోతల వంశీ, ఒగ్గు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేతో సత్వర న్యాయం

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 8: బాధితులకు సత్వర న్యాయం చేయడానికే గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 16 మంది నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను పోలీస్‌స్టేషన్‌లకు పంపించి బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించామన్నారు.

నలుగురి రిమాండ్

చందుర్తి, ఏప్రిల్ 8:ఇంటి రుణం పొందేందుకు పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించిన ఘటనలో నలుగురిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. జోగాపూర్‌కు చెందిన బుర్ర వెంకటేశం వ్యక్తిగత బ్యాంకు రుణం కోసం నర్సింగాపూర్‌కు చెందిన సాయి ప్రణీత్‌తోపాటు కోరుట్లకు చెందిన పృథ్వీ, కరీంనగర్ చెందిన వెంకటేష్‌ను సంప్రదించాడు. నకిలీ స్టాంపులను సృష్టించి, ధ్రువీకరణ పత్రం తయారుచేసి బ్యాంకులో సమర్పించాడు. ఆ ధ్రువీకరణ పత్రంపై బ్యాంక్ అధికారులు జోగాపూర్ పంచాయతీ కార్యదర్శి కవితతో విచారణ చేపట్టగా అది నకిలీదిగా గుర్తించారు. చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయడంతో ఎస్సై శ్రీకాంత్ విచారణ చేపట్టి వెంకటేశం, సాయి ప్రణీత్, పృథ్వీ, వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

పాడి రైతు హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8: ఎల్లారెడ్డిపేటకు చెందిన మార్పు జగన్‌రెడ్డి(40) అనే పాడి రైతు గుండె పోటుతో మృతి చెందాడు. ఆదివారం అర్ధరాత్రి ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించే క్రమంలో గుండెపోటుకు గురయ్యాడు.

నేతన్నలకు అండగా బండి సంజయ్


సిరిసిల్లలో మాట్లాడుతున్న రాణి రుద్రమరెడ్డి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8: సిరిసిల్లలో నేతన్నలకు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అండగా ఉంటారని, నేతన్నల సమస్యల పరిష్కారం కోసం సిరిసిల్లలో ఈ నెల 10న దీక్ష చేపట్టనున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లో బుధవారం ఉదయం 10గంట నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఎంపీ బండి సంజయ్ దీక్ష చేపడతారన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు నేతన్నల జీవితాలను ఉరికొయ్యాల పాలు చేశాయన్నారు. నేతన్నలకు శాశ్వత ఉపాధి కల్పించాలని దీక్ష చేస్తున్నట్లు చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోపీ, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్, మహేష్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కారెడ్ల మాల్లారెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ కౌన్సిలర్లు బోల్గం నాగరాజుగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణాలను అడ్డుకున్న రైతులు

సిరిసిల్ల, రూరల్, ఏప్రిల్ 8: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని మెడికల్ కళాశాల భవన నిర్మాణ పనులను సోమవారం రైతులు అడ్డుకున్నారు. కాంట్రాక్టర్ పోలీసులకు సమాచారం అందించడంతో ఆందోళన చేస్తున్న రైతులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబరు 408లో ఉన్న 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గతంలో అప్పటి ప్రభుత్వాలు 40 మంది నిరుపేద రైతులకు అందించాయి. జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరవడంతో రైతులకు సమాచారం ఇవ్వకుండా భూమిని చదును చేశారు. పరిహారం అందించకుండానే కళాశాల భవనాలను నిర్మించగా రైతులు ఆందోళన చేపట్టారు. పరిహారం ఇవ్వాలని ఆందోళన చేసినా ఎమ్మెల్యే కేటీఆర్‌తో పాటు అధికారులు పట్టించుకోకపోవడంతో తీసుకున్న భూమికి పరిహారం రాదని నిర్ధారించుకున్న రైతులు మిగతా భూమిలో అదనపు భవనాలను నిర్మించకుండా అడ్డుకుంటామని నిర్ణయించుకున్నారు. కాంట్రాక్టర్ ఫిబ్రవరి 7న పనులు ప్రారంభించేందుకు రాగా రైతులు అడ్డుకున్నారు. దీంతో కలెక్టర్ అనురాగ్ జయంతి అప్పటి ఆర్డీవోను పంపించి రైతులకు న్యాయం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూమికి బదులు మరో చోట భూమి ఇస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. రెండు నెలలు గడుస్తున్నా స్పందన లేకపోగా సోమవారం కాంట్రాక్టర్ నిర్మాణాలు చేసేందుకు రావడంతో రైతులు అడ్డుకున్నారు. పరిహారం ఇచ్చిన తరువాతనే భవనాలను నిర్మించుకోవాలని రైతులు సీఐ రఘుపతికి వివరించడంతో స్పందించిన సీఐ రెవెన్యూ అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో పరిష్కరించుకోవాలని పంపించి వేశారు. 9వ వార్డు కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్ సింగిల్ విండో డైరెక్టర్ సలేంద్రీ బాలరాజుయాదవ్, లింగంపల్లి అశోక్, రాజశేఖర్, ఎనగందుల ప్రేమల, లింగంపల్లి దేవరాజు, గొడుగు మల్లేశం, గొడుగు ఎల్లయ్య ఉన్నారు.

అటవీ భూములను సంరక్షించాలి


వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

రుద్రంగి, ఏప్రిల్ 8: రుద్రంగి మండలం మానాల, గిరిజన తండాల చుట్టూ ఉన్న అటవీ భూములను సంరక్షించాలని సోమవారం డీఎఫ్‌వో బాలమణికి మానాల గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానాల చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేస్తున్నారని, భూమిని చదును చేసి ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, జక్కు మోహన్, చంద రాజేశం, జూల భూమయ్య, తుమ్ జలపతి, రవీందర్, జూల దిలీప్, జక్కుల బ్రహ్మనందం, జలందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గారడీల ప్రభుత్వం


మార్కెట్‌లో మహిళలతో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

సిరిసిల్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ గ్యారంటీల ప్రభుత్వం కాదు.. గారడీల ప్రభుత్వం. హామీలు ఇవ్వడమే కానీ అమలు చేసుడు లేదు' అని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం ఉదయం జిల్లా కేంద్రంలో మార్నింగ్ వాక్ చేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రజల్లో పార్లమెంట్ ఎన్నికలపై ప్రచారం నిర్వహించారు. ఉదయం సిరిసిల్ల జూనియర్ కళాశాల మైదానం నుంచి మొదలైన వాకింగ్ అంబేద్కర్ చౌరస్తా మీదుగా బతుకమ్మ ఘాట్, రైతుబజార్ వెంట సాగింది. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్‌కు హామీలు ఇవ్వడం.. ఎగ్గొట్టడం కొత్తేమీ కాదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు నిజానికి అబద్ధానికి, పదేళ్ల అభివృద్ధికి, వంద రోజుల మోసానికి మధ్య జరుగుతున్నాయన్నారు. 2019లో ఓడినా ప్రజల్లోనే ఉన్నానని, ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రయోజనాలపై ప్రశ్నించే గొంతునవుతానని అన్నారు. 1952లో బద్దం ఎల్లారెడ్డి ఎంపీగా ఉన్నప్పటి నుంచి 2014 వరకు ఎందరు ఎంపీలు వచ్చినా రైల్వేలైన్ ముందుకు సాగలేదని, తాను ఎంపీగా గెలిచిన తర్వాతే కొత్తపల్లి-మనోహరాబాద్ మంజూరు చేయించానని తెలిపారు. ప్రస్తుతం సిద్దిపేట వరకు రైలు నడుస్తోందని, మరో ఏడాదిలో సిరిసిల్లకు రైలు వస్తుందని అన్నారు. కొండగట్టు ఆలయ అభివృద్ధిలో భాగంగా 332 ఎకరాలు ఫారెస్ట్ భూమిని ఆలయానికి కేటాయించినట్లు చెప్పారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఐదేళ్లలో ఐదు రూపాయలు కూడా తీసుకు రాలేదని, వేములవాడ, కొండగట్టు ఆలయాల కోసం నయాపైసా తేలేదని అన్నారు. బండి సంజయ్‌కి అభివృద్ధి చేయడం చేతగాకనే బడాయి మాటలు మాట్లాడుతున్నాడన్నారు. ఎమ్మెల్యేగా ఓడితే ఎంపీగా పోటీ చేయడం సంజయ్‌కి అలవాటైపోయిందని, ఏమైనా పునరావాసా కేంద్రమా? అని విమర్శించారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, అక్కరాజు శ్రీనివాస్, అగ్గిరాములు, మ్యాన రవి, హరీష్, సికిందర్, రాజు, దిడ్డి రాజు, పూర్ణచందర్, రమణారావు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన నేత కార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకోవడంతో సోమవారం బాధిత కుటుంబాన్ని వినోద్‌కుమార్ పరామర్శించారు. రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు.